క్లుప్తంగా

రంజింపజేసిన సినీ సంగీత విభావరి



సినీ గీతం పాడుతున్న గాయకుడు

సీతంపేట: ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవాల్లో భాగంగా స్వరాంజలి, స్వరార్చన కళా సంస్థల ఆధ్వర్యంలో సోమవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించిన సినీ సంగీత విభావరి అలరించింది. సంస్థ గాయనీ గాయకులు అంబిక, కల్యాణి, రంజిత, సుజాత, ఎం.కృష్ణంరాజు, భూమతిరావు, నరసింగరావు తదితరులు ఎన్టీఆర్ నటించిన చిత్రాల్లోని పాటలు పాడి ప్రేక్షకులను రంజింపజేశారు.

భర్త అదృశ్యంపై ఫిర్యాదు



రవికుమార్

మర్రిపాలెం: తన భర్త కనిపించడం లేదని కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. కంచరపాలెం సత్యనగర్ సుంకురుపేటలో ధనలక్ష్మి తన భర్త సనపల రవికుమార్‌తో కలిసి నివసిస్తోంది. ఈ నెల 17వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు సింహాచలం వెళ్లి వస్తానని భర్త చెప్పి ఇంటి నుంచి వెళ్లి ఇంతవరకు ఇంటికి చేరుకోలేదు. అంతటా గాలించినా, బంధువులను అడిగినా.. ఆమె భర్త కోసం వివరాలు తెలియకపోవడంతో భార్య ధనలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సదరు వ్యక్తి ఆచూకీ తెలిసిన వారు సమాచారం అందించాలని కంచరపాలెం పోలీసులు కోరారు.

యువతి అదృశ్యం

ఎంవీపీకాలనీ: ఓ యువతి అదృశ్యంపై ఎంవీపీ కాలనీ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలివి.. అక్కయ్యపాలెంలో కుటుంబ సభ్యులతో కలిసి కుసుమ అనే యువతి నివసిస్తోంది. ఈ నెల 22న ఆదర్శనగర్‌లోని స్నేహితుడు మధు వివాహానికి హాజరై తిరిగి ఇంటికి రాలేదు. అప్పటి నుంచి కుసుమ ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు పలు చోట్ల వెతికినా.. ఫలితం లభించలేదు. కుసుమ తండ్రి శ్రీనివాసరావు సోమవారం ఫిర్యాదు చేయడంతో ఎంవీపీ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉత్సాహంగా కథల పోటీలు



రాసిన కథలను చూపుతున్న విద్యార్థులు

మురళీనగర్: మురళీనగర్ మహిళలు, పిల్లల శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ వై.పద్మజ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా సోమవారం విద్యార్థులకు వారికి నచ్చిన కథల రచనలో పోటీలు నిర్వహించారు. ముందుగా వారితో కథల పుస్తకాలు చదివించారు. అనంతరం వారికి నచ్చిన కథలు రాసే పోటీలు జరిపారు. చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థులకు బిస్కెట్లు అందించారు.

మానసిక రోగుల చికిత్స కేంద్రం సందర్శన



కేంద్రంలో పరిశీలిస్తున్న న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సన్యాసినాయుడు

బీచ్‌రోడ్డు: చినవాల్తేరులోని మానసిక రోగుల చికిత్స కేంద్రాన్ని సోమవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు సందర్శించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజు అనుమతితో ఆయన కేంద్రంలోని వార్డులను పరిశీలించారు. మానసిక రోగుల స్థితి, వారికి అందుతున్న సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. వంటగదిని పరిశీలించి, ఆహార పదార్థాల నాణ్యతను తనిఖీ చేశారు. విభాగాధిపతి డాక్టర్ విజయలక్ష్మి, పారా లీగల్ వలంటీర్ ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

మహారాణిపేట: కేజీహెచ్‌లోని వన్ స్టాప్ సెంటర్‌ను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు సందర్శించారు. బాధితులకు అందుతున్న సౌకర్యాలు, కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది మరింత మెరుగ్గా పనిచేయాలని సూచించారు.



సుభాష్‌నగర్‌లో అధ్వానంగా మ్యాన్‌హోల్



మహారాణి వీధిలో లీకవుతున్న యూజీడీ మ్యాన్‌హోల్



జ్యోతినగర్‌లో గోతులమయంగా మ్యాన్‌హోల్

అస్తవ్యస్తంగా యూజీడీలు

- 54, 55 వార్డుల్లో అధ్వానంగా మ్యాన్‌హోళ్లు
- తరచూ లీకేజీలతో దుర్గంధభరితంగా రహదారులు
- అవస్థలు పడుతున్న స్థానికులు, వాహన చోదకులు
- సమస్య పరిష్కరించాలని అధికారులకు విజ్ఞప్తి



బాపూజీనగర్‌లో మ్యాన్‌హోల్ నుంచి బయటకు వస్తున్న పిట్ వ్యర్థాలు.



కంచరపాలెం ప్రధాన రహదారిలో ప్రమాదభరితంగా యూజీడీ

కంచరపాలెం: జీవీఎంసీ 54, 55 వార్డుల్లోని యూజీడీ మ్యాన్‌హోళ్లు అధ్వానంగా తయారై.. అస్తవ్యస్తంగా దర్శనమిస్తున్నాయి. కంచరపాలెం, ఊర్వశి కూడలి, ఐటీఐ జంక్షన్, 104 ఏరియా మర్రిపాలెం పరిధి బాపూజీనగర్, జ్యోతినగర్, మహారాణి వీధి, గౌరీనగర్, సుభాష్‌నగర్, రెడ్డికంచరపాలెం, జాషువానగర్ తదితర ప్రాంతాల్లోని మ్యాన్‌హోళ్లు ప్రమాదభరితంగా మారాయి. కొన్ని ప్రాంతాల్లో ఇవి శిథిలావస్థకు చేరాయి. మరికొన్ని చోట్ల తరచూ లీకవుతూ దుర్గంధాన్ని వెదజల్లుతున్నాయి. ఈ సమస్యతో ఆయా ప్రాంతాల ప్రజలు, వాహన చోదకులు అవస్థలు పడుతున్నారు.

ఔట్‌లెట్‌లు లేక రోడ్లపైకి వ్యర్థాలు

వార్డుల్లోని పలు ప్రాంతాల్లో ఇటీవల రోడ్లు నిర్మించి మ్యాన్‌హోళ్లను ఎత్తు చేయకుండా నిర్లక్ష్యంగా వదిలేశారు. ఎగువ ప్రాంతాల నుంచి యూజీడీ పైప్‌లైన్లు వేసి ఔట్‌లైన్ కనెక్షన్లు ఇవ్వడం కొన్ని ప్రాంతాల్లో మరిచిపోయారు. దీంతో మ్యాన్‌హోళ్లు తరచూ లీకవుతూ మురుగు నీరు, పిట్ వ్యర్థాలు రోడ్లపైకి చేరుతున్నాయి. ఇక్కడ నిర్మించిన యూజీడీలకు సక్రమమైన ఔట్‌లెట్‌లు లేకపోవడంతోనే వ్యర్థాలు రహదారులపైకి వస్తున్నట్లు శానిటరీ సిబ్బంది చెబుతున్నారు. తాజాగా కురుస్తున్న వర్షాలకు యూజీడీ మ్యాన్‌హోళ్లలో నీరు భారీగా చేరి వ్యర్థాలు బయట రావడంతో రహదారులు దుర్గంధ భరితంగా మారుతున్నాయి.

ఫిర్యాదులు పట్టించుకోని ప్రజాప్రతినిధులు

వర్షాలు పడితే పరిస్థితి మరీ దారుణంగా ఉంటోంది. వ్యర్థాలు, మురుగు నీరు రోడ్లపైకి చేరడంతో పారిశుధ్య సిబ్బందికి రోడ్లు, కాలువలు ఊడ్చే పని ఎక్కువవుతోంది. ఇక్కడి సమస్యలపై ఆయా వార్డుల కార్పొరేటర్లకు స్థానికులు ఫిర్యాదులు చేసినా.. పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. 2014, 2024ల్లో రెండు దఫాలు ఉత్తర ఎమ్మెల్యేగా ఎన్నికైన పి.విష్ణుకుమార్‌రాజు తమ వార్డుల అభివృద్ధికి ఏమీ చేయలేదని పలువురు విమర్శిస్తున్నారు. ఆయా వార్డుల్లో అభివృద్ధి పనులంటూ భూమిపూజలు చేయడం తప్ప.. ప్రజా సమస్యల పరిష్కారంపై చర్యలు శూన్యంగానే కనిపిస్తున్నాయి. ప్రజాప్రతినిధుల పర్యటనలు కానరాకపోవడంతో అధికారుల్లో ఎలాంటి చలనం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. జీవీఎంసీ జోన్-5 యూజీడీ అధికారులు పరిశీలించి యూజీడీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ఆయా వార్డుల ప్రజలు కోరుతున్నారు.

పరిసరాలు దుర్గంధభరితం

వార్డులోని యూజీడీ పైప్‌లైన్ల లీకేజీతో పరిసరాలు, రహదారులు దుర్గంధభరితంగా మారుతున్నాయి. రాకపోకల సమయంలో ఇబ్బంది పడుతున్నాం. అధికారులు స్పందించి శిథిలావస్థలో ఉన్న మ్యాన్‌హోళ్లకు మరమ్మతులు చేపట్టాలి.
– ఎస్.కృష్ణమూర్తి, బాపూజీనగర్, 104 ఏరియా

ప్రమాభరితంగా మ్యాన్‌హోళ్లు

వీధుల్లోని యూజీడీ మ్యాన్‌హోళ్లు ప్రమాదభరితంగా మారాయి. రోడ్లకు మరమ్మతులు చేసినప్పుడు మ్యాన్‌హోళ్ల ఎత్తు పెంచకపోవడంతో గోతులమయమయ్యాయి. అటుగా ప్రయాణించే ద్విచక్ర వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు.
– వై.అరుణ్‌బాబు, జాషువానగర్, కంచరపాలెం

అధికారులు స్పందించాలి

యూజీడీ పైప్‌లైన్ పనులు చేపట్టినప్పుడు ప్రధాన రహదారుల్లో బాగానే నిర్మించారు. కాలనీ వీధుల్లోకి వచ్చే సరికి సక్రమంగా వేయకపోవడంతో యూజీడీ మ్యాన్‌హోళ్లు అధ్వానంగా.. ప్రమాదకరంగా మారాయి. ఈ సమస్యపై ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదు. జోన్-5 యూజీడీ అధికారులు స్పందించి యూజీడీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి.
– ఎస్.రాంబాబు, మహారాణి వీధి

జోరుగా తాగునీటి పైప్‌లైన్ పనులు

సీతంపేట: అమృత్ 2.0 పథకంలో భాగంగా జీవీఎంసీ 43, 44 వార్డుల్లో నీటి ఎద్దడి ఉన్న పలు ప్రాంతాల్లో 24/7 తాగునీటి సరఫరా పైప్‌లైన్ పనులు జోరుగా జరుగుతున్నాయి. అక్కయ్యపాలెం 80 ఫీట్ రోడ్డు నుంచి శ్రీనివాసనగర్ మీదుగా నందగిరినగర్‌కు బల్క్ పైప్‌లైన్ వేశారు. ప్రస్తుతం దాడి రామ్మూర్తి కల్యాణ మండపం, కర్రివాని బ్రిడ్జి ప్రాంతంలో ఈ పనులు జరుగుతున్నాయి. 43, 44 వార్డుల్లోని శ్రీనివాసనగర్, నందగిరినగర్, గోశీలపాలెం, నరేంద్రనగర్, వెంకటేశ్వర కాలనీ ప్రాంతాల్లో వేసవిలో భూగర్భ జలాలు అడుగంటడంతో స్థానికులు తాగునీటి సమస్యను చాలా ఏళ్లుగా ఎదుర్కొంటున్నారు. ఆయా ప్రాంతాల్లో వేసవిలో నీటి ఎద్దడి సమస్య పరిష్కారానికి ఏషియన్ బ్యాంకు నిధులతో అబిద్‌నగర్‌లోని షాదీఖానా వద్ద భారీ వాటర్ ట్యాంక్ నిర్మించారు. దీని నుంచి నీటి ఎద్దడి ప్రాంతాలకు తాగునీటిని 24/7 సరఫరా చేసేందుకు ప్రస్తుతం ప్రధాన పైప్‌లైన్ పనులు చేపడుతున్నారు. మార్చి నుంచి భూగర్భ జలాలు అడుగంటడంతో నీటికి ఇబ్బంది పడుతున్నామని, వీలైనంత త్వరగా పనులు పూర్తి చేసి నీటి సరఫరాను అందించాలని స్థానికులు కోరుతున్నారు.



దాడి రామ్మూర్తి కల్యాణ మండపం వెనుక జరుగుతున్న పైప్‌లైన్ పనులు

ఫుట్‌పాత్‌ల ఆక్రమణ

సీతంపేట: నలుగురు నడవడానికి నిర్మించిన ఫుట్‌పాత్‌లు వ్యాపారాలకు అడ్డాగా మారాయి. రామాటాకీస్ రోడ్డులోని ప్రభుత్వ నేత్ర వైద్యశాల ముందున్న ఫుట్‌పాత్‌ను చిరువ్యాపారులు ఆక్రమించారు. పాదచారులు నడిచే వీలులేకుండా తమ వ్యాపారాలకు అడ్డాగా మార్చుకున్నారు. ఒకవైపు ట్రావెల్ బస్సులు గంటల తరబడి పార్కింగ్, మరోపక్క రాంగ్ రూట్‌లో వాహనాల ప్రయాణాలతో రద్దీగా ఉండే మార్గంలో పాదచారులు నడవడానికి ఇబ్బంది పడుతున్నారు. ఫుట్‌పాత్‌లను ఆక్రమించి పదుల సంఖ్యలో చిరు వ్యాపారాలు వెలుస్తున్నా.. అధికారులు చోద్యం చూస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఫుట్‌పాత్‌లపై పాదచారులు నడిచే వీలు కల్పించాలని పలువురు కోరుతున్నారు.



రామాటాకీస్ రోడ్డులో ఫుట్‌పాత్‌ను ఆక్రమించిన వ్యాపారాలు

పోర్టు ఎస్సీ, ఎస్టీ సంఘం నూతన కార్యవర్గం కొలువు

డాబాగార్డెన్స్: విశాఖపట్నం పోర్టు అథారిటీ ఎస్సీ, ఎస్టీ అధికారుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక సోమవారం జరిగింది. అధ్యక్షుడిగా ఉమామహేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా దేవీశ్వరరావు మరోసారి ఎన్నికయ్యారు. కోశాధికారిగా ఎం.సాల్మన్‌రాజు, ఉపాధ్యక్షులుగా డాక్టర్ టీఎస్ దీప్తి, కె.వేణుగోపాల్, ఈ.వెంకట్రావు, పి.ప్రసన్నకుమార్‌ను, సంయుక్త కార్యదర్శులుగా పి.సుందరేషన్, కె.శ్రీను, సిద్ధార్థకుమార్, కార్యనిర్వాహక కార్యదర్శులుగా ఎం.ఎస్.రావు, బూరి శ్రీను, సంజీవరావు, కె.వి.రమణతో పాటు పలువురు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. సీనియర్ సభ్యుడు ఎం.ఎస్.ఎస్.ఎస్. సింగ్ ఆధ్వర్యంలో పోర్టు అసోసియేషన్ కార్యాలయంలో ఈ ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్ఫూర్తితో పని చేస్తామన్నారు. ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు, కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.



ఉమామహేశ్వరరావు



దేవీశ్వరరావు

చిన్నారిని తల్లి చెంతకు చేర్చిన పోలీసులు

అల్లిపురం: తప్పిపోయి రోడ్డుపై ఏడుస్తూ తిరుగుతున్న ఏడేళ్ల చిన్నారిని టూటౌన్ పోలీసులు తల్లి చెంతకు చేర్చారు. టూటౌన్ సీఐ వీవీసీఎం ఎర్రంనాయుడు తెలిపిన వివరాల ప్రకారం రాగోలు సాయి కీర్తన అనే ఏడేళ్ల చిన్నారి సోమవారం ఉదయం 11 గంటల సమయంలో పాత జైలురోడ్డు దరి గొల్లలపాలెం వద్ద రోడ్డుపై ఏడుస్తూ తిరుగుతోంది. అదే సమయంలో టూటౌన్ బ్లూకోట్స్ కానిస్టేబుల్ శివ చూసి అమ్మాయి నుంచి వివరాలు తెలుసుకునేందుకు ప్రయత్నించాడు. ఆమె తన ఊరు కొత్తపల్లి అని చెప్పింది కానీ తల్లిపేరు, ఇంటి అడ్రస్ చెప్పలేకపోయింది. దీంతో టూటౌన్ సీఐ ఎర్రంనాయుడు సలహా మేరకు వాట్సప్ గ్రూప్‌లో వైరల్ చేశారు. అమ్మాయి తల్లి రాగోలు రేవతి తన భర్తను ఏడేళ్లుగా విడిపోయి కుమార్తె, తల్లితో కలిసి రామా టాకీస్ వద్ద వినాయకనగర్‌లో నివసిస్తూ ఒక హాస్టల్లో వంట మనిషిగా పని చేస్తోంది. సోమవారం ఉదయం ఎవరో చనిపోతే అక్కడికి తన తల్లితో కలిసి వెళ్లింది. సాయి కీర్తన ఒక్కతే ఇంట్లో ఉంది. ఎవరూ కనపడకపోవటంతో సాయి కీర్తన ఏడ్చుకుంటూ బయటికి వచ్చింది. వారింటి దగ్గర ఎవరో ఒక బామ్మ ఉంటే అక్కడికి వెళ్లింది. వారు దెబ్బలాడటంతో రామా టాకీస్ నుంచి గొల్లలపాలెం చేరుకుంది. ఇంటికి వచ్చిన పాప తల్లి రేవతికి కుమార్తె కనిపించక పోవటంతో ఏడుస్తూ వెదకడం మొదలుపెట్టింది. త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వెళ్లింది. ఇంతలో ఎవరో వాట్సప్‌లో ట్రెండ్ అవుతున్న ఫొటోలను ఆమెకు చూపించటంతో తన కుమార్తెగా గుర్తించింది. దీంతో టూటౌన్ పోలీస్ స్టేషన్‌కు చేరుకుంది. పాప తల్లిని గుర్తించడంతో సీఐ ఎర్రంనాయుడు పాపను తల్లికి అప్పగించారు. తన కుమార్తెను సంరక్షించినందుకు ధన్యవాదాలు రేవతి పోలీసులకు ధన్యవాదాలు తెలిపింది.



సాయికీర్తనను తల్లి రేవతికి అప్పగిస్తున్న టూటౌన్ సీఐ ఎర్రంనాయుడు, ఏఎస్ఐ కాంతం

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు



డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ శ్రీనివాస్, సిబ్బంది

మర్రిపాలెం: కంచరపాలెం పరిధిలో మద్యం తాగి వాహనం నడిపిన వారిపై పోలీసులు చర్యలు చేపట్టారు. ఈ మేరకు సోమవారం ఊర్వశి జంక్షన్ వద్ద ట్రాఫిక్ ఎస్ఐ శ్రీనివాస్ పలువురు కానిస్టేబుళ్లతో కలిసి డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ద్విచక్ర వాహనాలు, కార్లను ఆపి బ్రీత్ అనలైజర్ టెస్టులు చేశారు. మద్యం తాగి వాహనాలు నడిపిన పలువురిపై కేసులు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

రైల్వేస్టేషన్‌లో 6 కిలోల గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం: విశాఖ రైల్వేస్టేషన్‌లో గంజాయి అక్రమ రవాణా చేస్తున్న నిందితుడిని రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకుని, 6 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గవర్నమెంట్ రైల్వే పోలీసులు తెలిపిన వివరాలివి.. జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సిహెచ్.ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో సోమవారం ఆర్పీఎఫ్ ఎస్ఐ ఒబిషేక్ మిస్త్రీ, జీఆర్పీ ఎస్ఐ కె.టి.ఆర్.లక్ష్మి సిబ్బందితో కలిసి రైల్వే స్టేషన్‌లోని వివిధ ప్లాట్‌ఫారాల్లో తనిఖీలు నిర్వహించారు. మహారాష్ట్ర పాల్‌ఘర్ జిల్లాకు చెందిన ఇమ్రాన్ నాఫిస్ షేక్ విశాఖపట్నం రైల్వేస్టేషన్ మీదుగా మహారాష్ట్రకు అక్రమంగా రవాణా చేయడం గుర్తించారు. ఇతడిని అదుపులోకి తీసుకుని, రూ.30 వేల విలువైన 6 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరిచినట్లు జీఆర్పీ సిబ్బంది తెలిపారు.

కళాకారులకు బిల్లులు చెల్లించాలని ధర్నా

జగదాంబ: పోర్టు అథారిటీ పరిధిలోని గోడలపై వేసిన కళా రూపాల (బొమ్మలు)కు బిల్లులు వెంటనే చెల్లించాలని కోరుతూ సోమవారం పోర్టు ముఖద్వారం ఎదురుగా సీఐటీయూ నాయకుడు వై.రాజు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ ఈ పనుల్లో అనేక మంది చిత్రకారులు కష్టపడ్డారన్నారు. ఐదు నెలలు కావస్తున్నా ఇప్పటికీ పోర్టు అధికారులు డబ్బులు చెల్లించలేదన్నారు.

రోగులకు మరింతగా సేవ చేయాలి

మహారాణిపేట: ఉద్యోగులకు పూర్తి సహకారం అందిస్తామని కేజీహెచ్ నూతన సీఎస్ఆర్ఎంవో డాక్టర్ శ్రీహరి అన్నారు. సోమవారం ఇక్కడి వైఎస్సార్‌టీయూసీ యూనియన్, కేజీహెచ్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు నీలాపు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఉద్యోగులు నూతన సీఎస్ఆర్ఎంవోగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ శ్రీహరిని కలిశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉద్యోగులకు సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా నూతన సీఎస్ఆర్ఎంవో డాక్టర్ శ్రీహరి మాట్లాడుతూ పేషెంట్లకు మరింతగా సేవ చేయాలని, ఆస్పత్రికి మంచి పేరు తేవాలని అన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు నీలాపు శ్రీనివాసరావు, కార్యదర్శి సురుపల్లి రాజారావు, ఉపాధ్యక్షులు వెంకట్రావు, పార్వతి, జాయింట్ క్యాషియర్ బేగం, జయ, హెల్త్ ఇన్‌స్పెక్టర్ ఒ.ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్ శ్రీహరిని సత్కరిస్తున్న వైఎస్సార్‌టీయూసీ నాయకులు

ఆదర్శవంతంగా వైశాఖి స్పోర్ట్స్ పార్క్

మురళీనగర్: మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్క్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని పార్కు నిర్వహణ కమిటీ అధ్యక్షుడు సనపల వరప్రసాద్ అన్నారు. వేములపల్లి కళాక్షేత్రంలో సోమవారం నిర్వహించిన పార్క్ వార్షిక సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. వాకర్స్, సందర్శకుల అభిరుచిని తెలుసుకుని, వారికి కావాల్సిన సౌకర్యాలు అందుబాటులోకి తేవడమే ధ్యేయంగా పనిచేస్తున్నామన్నారు. ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు సహకారంతో నగరంలోనే అత్యుత్తమ పార్కుగా తీర్చిదిద్దేందుకు ప్రణాళిక తయారు చేశామని తెలిపారు. పార్కు కార్యదర్శి పి.వి.సూర్యనారాయణ రాజు ఏడాది కాలంలో నిర్వహించిన అభివృద్ధి, సాంస్కృతిక, సేవా కార్యక్రమాల నివేదికను వివరించారు. కోశాధికారి మళ్ల రామకృష్ణ పార్క్ ఆదాయం, వ్యయం వివరాలు తెలిపారు. పార్క్ న్యాయ సలహాదారు జనపరెడ్డి పృథ్వీరాజ్, పూర్వ అధ్యక్షుడు అంబికా ప్రసాద్, ఎన్నికల సలహా మండలి సభ్యుడు రొంగలి జగన్నాథం, సంకు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కార్యవర్గం నిర్వహించిన అభివృద్ధి పనులను ప్రశంసించారు. ఉపాధ్యక్షులు పల్లా చంద్రమౌళి, శీతిన సత్యనారాయణ, సంయుక్త కార్యదర్శులు రఘురామ పండ, పి.కంకరాజు, సంయుక్త కోశాధికారి కె.కె.సురేష్, కార్యవర్గ సభ్యులు ఎం.వి.రెడ్డి, టి.ఎస్.ఎన్.రాజు, సిహెచ్.రామారావు, పి.శ్రీనివాసరావు, ఆర్.నాగేశ్వరరావు, పి.సన్యాసిరావు, ఎల్.వి.సుధాకర్, పి.సూర్యనారాయణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సనపల వరప్రసాద్

క్రైస్తవ శ్మశానవాటికలో సదుపాయాలు కల్పించాలి

మహారాణిపేట: క్రైస్తవుల శ్మశానవాటికలో సదుపాయాలు కల్పించాలని, సమాధుల చుట్టూ ప్రహరీ గోడ నిర్మించాలని బీజేపీ మైనారిటీ నాయకులు, క్రిస్టియన్ సిమెట్రీస్ నాయకులు కోరారు. సోమవారం ఉత్తర ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు కుమార్తె శ్యామలదీపికను వారు కలిసి వినతిపత్రం అందించారు. బర్మా క్యాంప్‌లోని శ్మశానవాటికలో సదుపాయాలు కల్పించాలని, క్రైస్తవుల సమాధుల చుట్టూ ప్రహరీ నిర్మించాలని, ప్రత్యేక గేటు ఏర్పాటు చేసి మెయింటెనెన్స్ ఇవ్వాలని బీజేపీ నాయకులు సిహెచ్.రాజబాబు, ఒ.ఆల్బర్ట్ కోరారు. జీవీఎంసీ జోన్ 4-5 క్రిస్టియన్ సిమెట్రీస్ వెల్ఫేర్ సొసైటీ ప్రెసిడెంట్ అధ్యక్షుడు ఎం.దేవానంద్, ప్రధాన కార్యదర్శి వారా జాకబ్, సంయుక్త కార్యదర్శి బచ్చు రాజు పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు.



వినతిపత్రం అందిస్తున్న మైనారిటీ నాయకులు

బాధిత కుటుంబానికి అండ

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డులో ఓ పేద కుటుంబానికి కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ అండగా నిలిచారు. బాధితురాలు విస్సారపు నాగమణికి జీవీఎంసీలో ఉద్యోగం కల్పిస్తూ ఇచ్చిన సిఫారసు లేఖను మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ చేతుల మీదుగా వార్డు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా వాసుపల్లి మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వ హయాంలో 2022 జూన్ 11న జ్ఞానాపురం జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో విద్యుత్ షాక్‌తో నాగమణి కుమారుడు చైతన్య (8) మృతి చెందాడు. అప్పటి నుండి కార్పొరేటర్ పూర్ణిమ, శ్రీధర్ వారికి అండగా నిలిచారని తెలిపారు. ఏపీఈపీడీసీఎల్ సంస్థ ద్వారా బాధితులకు రూ.5 లక్షలు ఆనాడు అందజేశారు. ప్రమాదవశాత్తు జరిగిన విపత్తుల్లో బాధితులకు అండగా నిలిచిన ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ మాత్రమే అన్నారు. కూటమి ప్రభుత్వానిది రాక్షస పాలన అని ఏడాదిలోనే ప్రజలకు తెలిసిపోయిందన్నారు. వాసుపల్లి హయాంలో వార్డులో సుమారు రూ.11 కోట్లకు పైగా అభివృద్ధి పనులు జరిగాయని వార్డు కార్పొరేటర్ పూర్ణిమ తెలిపారు. ఆయన సహకారంతోనే బాధిత కుటుంబానికి అండగా నిలిచామన్నారు.



వాసుపల్లితో కలిసి ఉద్యోగ సిఫారసు లెటర్ అందిస్తున్న కార్పొరేటర్ పూర్ణిమ